క్లుప్తంగా

ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్ పరిశీలన



మెరకముడిదాం పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న చీపురుపల్లి ఆర్డీఓ సత్యవాణి

మెరకముడిదాం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మెరకముడిదాంలో పోలింగ్ స్టేషన్‌ను చీపురుపల్లి ఆర్డీఓ జి.వి.సత్యవాణి శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ స్టేషన్‌లో ఉన్న సదుపాయాలను తహసీల్దార్ అజూరఫీజాన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్‌ను అమలుచేయాలని సూచించారు.

వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు



మాట్లాడుతున్న ఏపీడీ రమామణి

దత్తిరాజేరు: ఉపాధి హామీ పథకం పనుల్లో వేతనదారులందరికీ వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు చేయించాలని ఏపీడీ రమామణి సూచించారు. స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌ల సమావేశానికి హాజరైన ఆమె.. గ్రామాల్లో వలసల నివారణే లక్ష్యంగా చేపడుతున్న ఉపాధి పనుల్లో అర్హులైన వారందరికీ పనులు కల్పించాలన్నారు. జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే జాబ్ కార్డు అందివ్వాలని, పనులు కూడా కల్పించాలన్నారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేయిస్తే వేతనదారులకు గిట్టుబాటు అయ్యే వేతన వస్తుందన్నారు.

'పీఎం సూర్యఘర్'పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఈఈ సురేష్‌కుమార్

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పీఎం సూర్యఘర్ ముక్తి బిదిలీ యోజన పథకంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్‌శాఖ ఈఈ సురేష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని సూర్యఘర్ వినియోగం, వాటి వల్ల కలిగే ప్రయోజనం, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలపై వినియోగదారులకు వివరించారు. ప్రతీ ఒక్కరు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రాయితీ పొందాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు బి.వెంకటరావు, వేపాడ ఏఈ సిహెచ్.సూరిబాబు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మూగజీవాల ఆరోగ్యం కోసం వైద్యశిబిరాలు



మూగజీవాలకు వ్యాక్సిన్లు వేస్తున్న ప్రత్యేక అధికారి చిన్నయ్య

చీపురుపల్లి: మూగజీవాలకు మెరుగైన వైద్యం అందించడం కోసమే పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు పశు సంవర్ధకశాఖ ప్రత్యేక అధికారి డా.ఆర్.చిన్నయ్య తెలిపారు. మండలంలోని రావివలస గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. మూగ జీవాలకు వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ డా.ఎస్.దామోధరరావు, ఏడీ డా.ఆర్.శారద పాల్గొన్నారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి



మృతుడు ముల్లు సూర్యనారాయణ

చీపురుపల్లిరూరల్ (గరివిడి): ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిన వృద్ధుడు మృతి చెందిన సంఘటన గరివిడి మండలం వెదుళ్లవలస గ్రామంలో చోటుచేసుకుంది. గరివిడి ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. వెదుళ్లవలస గ్రామానికి చెందిన ముల్లు సూర్యనారాయణ(64) శుక్రవారం ఉదయం లట్టబంద చెరువులో బోర్లపడి ఉండడాన్ని స్థానికులు గమనించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని భార్య, కుమారుడు వెళ్లి బయటకు తీసి చూడగా అప్పటికే మరణించాడు. కళ్లంలో ఆవుల పేడ తీసి చేతులు శుభ్రం చేసుకునేందుకు చెరువుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి పడడంతో మృతి చెంది ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతుని భార్య ముల్లు ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

దుష్ప్రచారం తగదు

గజపతినగరం: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం లేదంటూ ప్రతిపక్ష నేతలు దుష్ప్రచారం చేయడం తగదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఇదే విషయమై ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కేవలం ఏడు నెలలే అయిందని, ఇప్పటికే పింఛన్లు పెంచామన్నారు.

సీహెచ్‌సీలో.. పోస్ట్‌మార్టం రచ్చ



చీపురుపల్లి సీహెచ్‌సీ

- అందుబాటులో లేని సూపరింటెండెంట్
- జెడ్పీ చైర్మన్ ఫిర్యాదు మేరకు డీసీహెచ్‌ఎస్ ఆకస్మిక సందర్శన
- ఆ సమయంలో కూడా సూపరింటెండెంట్ గైర్హాజరు

చీపురుపల్లి:

మృతదేహానికి పోస్టుమార్టం చేయాల్సిన వైద్యుల నిర్లక్ష్యం బాధిత బంధువులను ఆవేదనకు గురిచేస్తోంది. సకాలంలో మృతదేహం వచ్చినా వైద్యులు తప్పించుకునే ధోరణి వివాదాస్పదంగా మారుతోంది. చీపురుపల్లి సీహెచ్‌సీలో పోస్టు మార్టం వ్యవహారం రచ్చకెక్కింది. మెరకముడిదాం మండల కేంద్రంలో శుక్రవారం ట్రాక్టర్ పై నుంచి జారిపడిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మధ్యాహ్నం 3.30 గంటలకే మృతదేహాన్ని ఆస్పత్రికి చేర్చారు. పోస్టుమార్టం చేసేందుకు వైద్యులు నిరాకరించడంతో మృతుని బంధువులు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.సుధీర్‌కు ఫోన్‌లో మాట్లాడి నిర్ణీత సమయంలోనే మృతదేహం వచ్చిన కారణంగా పోస్టు మార్టం నిర్వహించాలని సూచించారు. పోస్టుమార్టం చేస్తామని నమ్మకంగా చెప్పినా చేయలేదు. దీనిపై వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఇప్పిలి అనంతం ఆస్పత్రికి చేరుకుని వైద్యులను ప్రశ్నించడంతో పోస్టుమార్టం నిర్వహించారు. వైద్యుల నిర్లక్ష్యాన్ని జెడ్పీ చైర్మన్ డీసీహెచ్‌ఎస్ పద్మజ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె హుటాహుటిన సాయంత్రం 6.30 గంటలకు స్థానిక ఆస్పత్రిని సందర్శించారు. ఆ సమయంలో కూడా సూపరింటెండెంట్ సుధీర్ లేకపోవడం గమనార్హం. ఇదే విషయంపై డీసీహెచ్‌ఎస్ మాట్లాడుతూ సూపరింటెండెంట్‌కు ఆరోగ్యం బాగులేదని తెలిపారన్నారు. పోస్టు మార్టం విషయంపై స్థానిక విలేకరులు ప్రస్తావించగా సాయంత్రం 5 గంటల వరకు పోస్టు మార్టం నిర్వహించాల్సి ఉందని, 4 గంటలకు మృతదేహం వచ్చినప్పటికీ పేపర్లు రాలేదని వైద్యులు చెప్పారని ఆమె తెలిపారు. ఈ విషయంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ అలసత్వం వహించడం వివాదానికి కారణమన్న చర్చ జరుగుతోంది.

అవినీతిపై మాట్లాడరెందుకు..!



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

శృంగవరపుకోట: ఉపాధి పనుల్లో జరిగిన అవినీతిపై జిల్లా అధికారులు ఎందుకు మాట్లాడరని, చర్యలు ఎందుకు తీసుకోరని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గాడి అప్పారావు, మద్దిల రమణ ప్రశ్నించారు. జామి మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జామిలో పలు పంచాయితీల్లో ఉపాధి పనులపై జరిగిన అవినీతి సోషల్ ఆడిట్‌లో బట్టబయలు అయ్యిందన్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా అధికారులు, ప్రభుత్వాలు ఏమీ పట్టనట్టు చూస్తున్నాయని, ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మెటీరియల్ వర్కుల పేరుతో తమ కార్యకర్తల జేబులు నింపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఉపాధి హామీ చట్టంలో లోపాలు సరిదిద్ది, పేదలకు ఉపాధి కలిగేలా చూడాలని కోరారు.

అక్రమంగా కల్వర్టు నిర్మాణం



సర్పంచ్ పైడిపునాయుడు



ఇరిగేషన్ అధికారులు చేయించిన కల్వర్టు నిర్మాణం

గజపతినగరం: మండలంలోని ముదుపాడ గ్రామ సమీపంలో ఇరిగేషన్ అధికారులు అక్రమంగా కల్వర్టు నిర్మాణం చేపడుతున్నట్లు సర్పంచ్ కడుపుట్ల పైడిపునాయుడు ఆరోపించారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తనకు గానీ గ్రామపెద్దలకు గానీ ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఇరిగేషన్ అధికారులు మొండి వైఖరితో కల్వర్టు నిర్మాణం చేయిస్తున్నారన్నారు. గ్రామంలో ఏ రకమైన నిర్మాణాలు చేయాలన్నా సర్పంచ్‌కు తెలియపరచాలన్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. ఇదే ఘటనపై తాను రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే రెండు రోజుల పాటు పనులు నిలిపివేశారని, గ్రామంలో తాను లేని రోజుల్లో మళ్లీ నిర్మాణ పనులు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా పనులు ఆపకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అయితే ఈ నిర్మాణ విషయమై ఇరిగేషన్ డీఈ రామునాయుడును సాక్షి సంప్రదించగా, కల్వర్టు పనులకు పర్మిషన్ ఆర్డర్ ఉందని చెప్పారు.. అయితే ఆ ఆర్డరు కాపీ మాత్రం బయటపెట్టలేదు.

అవగాహనతోనే టీబీ దూరం



కోడూరు గ్రామంలో టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

చీపురుపల్లిరూరల్(గరివిడి): సిగరెట్లు కాల్చడం, మద్యం సేవించడం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటే టీబీ వ్యాధినుంచి బయటపడవచ్చని గరివిడి పీహెచ్‌సీ వైద్యాధికారులు దీప్తి, రాజ్యలక్ష్మి తెలిపారు. చీపురుపల్లి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ లలిత ఆధ్వర్యంలో గరివిడి మండలంలోని కోడూరు, దువ్వాం గ్రామాల ప్రజలకు టీబీ వ్యాధిపై శుక్రవారం అవగాహన కల్పించారు. టీబీ వ్యాధిగ్రస్తులకు అందజేస్తున్న ప్రభుత్వ వైద్య సేవలను వివరించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ గేదెల శంకరరావు, మాజీ సర్పంచ్‌లు గేదెల ఆదినారాయణ, అడపా సూర్యనారాయణ, సీహెచ్‌ఓ సత్యంనాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య తనిఖీలు



గజపతినగరం: మహిళ బీపీ పరిశీలిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారిణి పుష్పాంజలి

గజపతినగరం: మండలంలోని డోలపాలెంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి హాజరైన 69 మందికి వైద్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతిఒక్కరూ మెరుగైన ఆరోగ్యానికి రోజూ తినే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలని మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి పుష్పాంజలి సలహా ఇచ్చారు.
గంట్యాడ: మండలంలోని కొర్లాం గ్రామంలో విజయనగరంలోని కాస్వి ఆస్పత్రి వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 100 మందికి వైద్యులు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

పైప్‌లైన్ లీకేజీలతో తాగునీరు కలుషితం



నాగంపేటలో పైప్‌లైన్ లీకులు

చీపురుపల్లి: ఎక్కడికక్కడే పైప్‌లైన్లు లీకవుతుండడంతో తాగునీరు కలుషితమవుతుంది. డయేరియా వంటి వ్యాధులకు కారకంగా మారుతోంది. కొద్దిరోజుల కిందట గుర్ల మండలంలో డయేరియా ప్రబలి 14 మంది మృతి చెందినా... పల్లెలకు పరిశుభ్రమైన తాగునీటి సరఫరాకు అధికారులు చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని రావివలస పంచాయతీ పరిధి నాగంపేటలో వారం రోజులుగా తాగునీటి పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. వృథా నీరు తిరిగి పైప్‌లైన్‌లోకి చేరుతోంది. ఈ విషయాన్ని పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోయారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన సత్తిబాబు

గంట్యాడ: మండల కేంద్రం నుంచి విజయనగరానికి వెళ్లే మార్గమధ్యంలో నరవ ఏఎంజీ కాలనీ జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమటాపు సత్తిబాబు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గంట్యాడ మండలంలోని మురపాక గ్రామానికి చెందిన సత్తిబాబు తన ద్విచక్ర వాహనంపై విజయనగరం వైపు వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో అతడి కాలు రెండు వేళ్లు తెగిపోయాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వైద్యసేవల నిమిత్తం క్షతగాత్రుడిని విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు చేయాలి

బొండపల్లి: ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలని తహసీల్దారు డోలా రాజేశ్వరరావు సూచించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌వోలతో తహసీల్దారు శుక్రవారం సమావేశమై, పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిందని, ప్రతిచోటా ఎన్నికల కోడ్ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎక్కడా రాజకీయ నాయకులకు సంబంధించి ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులు ఉండకుండా చూడాలన్నారు.

సంతాపం

శృంగవరపుకోట: ఎస్టీ కమిషన్ సభ్యుడు కొర్ర రామలక్ష్మిని స్టేట్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డి.వి.జి.శంకరరావు శుక్రవారం పరామర్శించారు. ఎస్.కోట మండలం కిల్తంపాలెం పంచాయతీ భర్తాపురం గ్రామంలో ఎస్టీ కమిషన్ మెంబర్ రామలక్ష్మి అన్న కండిపల్లి సత్యనారాయణ ఇటీవల మరణించటంతో రామలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన సత్యనారాయణ పార్థీవ దేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను, రామలక్ష్మి, ఆమె భర్త రామచంద్రరావులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

తెగుళ్ల నివారణతో అధిక దిగుబడులు



సాతాంవలసలో మామిడిపంటను పరిశీలించి సస్యరక్షణ చర్యలను వివరిస్తున్న జిల్లా ఉద్యానవనశాఖాధికారి జమదగ్ని

మెరకముడిదాం: మామిడిని ఆశించే తెగుళ్లను నివారిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఎ.వి.ఎస్.వి.జమదగ్ని అన్నారు. సాతాంవలస గ్రామంలో ఉద్యానవనశాఖాధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మామిడి సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో తోటలను పరిశీలించి చీడపీడల నివారణ పద్ధతులను వివరించారు.

• కమ్మేసిన పొగమంచు



బొండపల్లి మండలాన్ని పొగమంచు కమ్మేసింది. రాత్రి 8 గంటల నుంచే మంచు కురువడం ప్రారంభమై ఉదయం 8 గంటల వరకు ఉంటోంది. దట్టంగా కురుస్తున్న మంచు కారణంగా ఎక్కడ ఏం ఉందో కానరావడం లేదు. ఎదురుగా వస్తున్న మనిషి కూడా దగ్గరకు వెళ్తే తప్ప కనిపించని పరిస్థితి. టార్చిలైట్లు, సెల్‌ఫోన్ లైట్లు వేసుకుని మరీ బయటకు వెళ్లాల్సిన దుస్థితి. ఈ చిత్రంలో కనిపిస్తోంది.. బొండపల్లి మండలం, దేవులపల్లి సమీప పొలాల్లో శుక్రవారం ఉదయం కురిసిన మంచు దృశ్యం.
– బొండపల్లి

• మోకాళ్లపై నిరసన



వేపాడ మండలం ఆతవ గ్రామస్తులు రోడ్డు పనులు చేపట్టాలంటూ చేపట్టిన ఆందోళన శుక్రవారం ఐదో రోజుకు చేరింది. సీపీఎం నాయకుడు చల్లా జగన్, బహుజన నేతలు ఉదయ్‌భాస్కర్, కెర్రి దేముడు తదితరుల నేతృత్వంలో శుక్రవారం రోడ్డుపై గ్రామస్తులు, సంఘాల నేతలు, మహిళలతో కలిసి మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. అధికారులు, పాలకులు స్పందించి తారు రోడ్డు పనులు చేపట్టే వరకు ఆందోళన కొనసాగిస్తామని పేర్కొన్నారు. డప్పు రాజు, గొంప సన్నిబాబు, గొంప అవతారం, లెంక కోటసన్యాసిరావు, గణేష్, లక్ష్మణరావు, అప్పలరాజు, మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.
– వేపాడ

వైభవంగా వీరాంజనేయ తీర్థ మహోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

లక్కవరపుకోట: మండలంలోని నిడుగట్టు గ్రామంలో గల వీరాంజనేయస్వామివారి 24వ తీర్థ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గుల్లిపల్లి కృష్ణకుమారి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి కుంకుమార్చన, పూజా కార్యక్రమాలను గ్రామస్తులు నిర్వహించారు. స్వామివారిని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మండల స్థాయి వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. సాంస్కృతిక కార్యక్రమాలను అలరించాయి.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం పరిశీలన



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీటీ, ఏఎస్‌ఐ

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన పోలింగ్ కేంద్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ టి.రమేష్ స్థానిక ఏఎస్‌ఐ శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. పోలింగ్‌కు అవసరమైన సౌకర్యాలు ఉన్నాయా? లేదా? అని పరిశీలించారు. ఈ సందదర్భంగా డిప్యూటీ తహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ మండలంలోని ప్రస్తుతం 60 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో వుందని గ్రామాల్లో పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు అప్రమత్తంగా వుండాలని సూచించారు. గ్రామాల్లో రాజకీయ నాయకులకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్స్ వుండరాదని తెలిపారు. అలాగే విగ్రహాలకు ముసుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

లేగదూడల ప్రదర్శన



ప్రథమ బహుమతి అందుకుంటున్న రైతు సన్యాసిరావు

గంట్యాడ: మండలంలోని బుడతానపల్లెలో లేగదూడల ప్రదర్శన శుక్రవారం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని తిలకించిన పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రెడ్డి కృష్ణ.. పాడిరైతులకు పలు సూచనలు చేశారు. పశువుల ఆరోగ్య సంరక్షణపై దృష్టిసారించాలని తెలిపారు. ఏదైనా వ్యాధితో మూగజీవాలు బాధపడినట్లు అనిపిస్తే వెంటనే పశువైద్య కేంద్రానికి వాటిని తీసుకురావాలన్నారు. ఇదిలా ఉండగా, లేగదూడల ప్రదర్శనలో మొత్తం 55 ఆడపెయ్యలను ప్రదర్శనలో ఉంచగా, బుడతానపల్లెకు చెందిన ఆడప సన్యాసిరావు, చినమానాపురానికి చెందిన రొంగళి శివ, బుడతానపల్లెకు చెందిన పల్లి అప్పలరాజుల దూడలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో గంట్యాడ పశువైద్యాధికారి బి.సత్యనారాయణ, డాక్టరు పి.అంజలి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ ఆవుపాలను కొనుగోలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కొత్తవలస: విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాలు సేకరణలో పాడి రైతులను ఇబ్బందులకు గురు చేస్తున్నారని, యాజమాన్యం ఆవు పాలు కొనుగోలు చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి డేగల అప్పలరాజు ఆధ్వర్యంలో తహసీల్దార్ బి.నీలకంఠారావుకి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ విశాఖ డెయిరీ ఆవు పాలు సేకరణలో కొన్ని గ్రామాల్లో తీసుకోవడం లేదని, మరికొన్ని గ్రామాల్లో 10శాతం నుంచి 20 శాతం వరకు కోత విధించి తీసుకోవడం వలన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.